# చెలి

విశ్వ విహారం చేస్తూ దారితప్పి భూగోళం చేరిన గంధర్వకన్య... అందాలొలక బోస్తున్న అపురూప చిత్తరువుగా మారి అలరారుతున్నట్టు... సుమనోహరంగా వుందా చిత్రపటం.

సహజవర్ణాల హరివిల్లు సైతం అబ్బురపడేలా... సప్తవర్ణాలన్నీ పందెంకాసి... సౌందర్యం సౌరభాలుగా ఆ మేనికి పొదగబడినట్టు... అద్భుతంగా వుందా కళాఖండం.

ఆహూతులంతా మైమరిచి తన్మయత్వంతో తిలకిస్తున్నారు.

తన ప్రియుడి ఛాయా చిత్రాన్ని కుడి చేతిలో బిగించేసి... అరమోడ్పు కనులతో విరహపు విరాగ సరాగాల్లో తేలియాడుతున్నట్టున్న... ఆ అందమైన కుందనపు బొమ్మ ఓరచూపు వాలకం, హొయలు... చూపరులకు గిలిగింతలు రేపుతోంది.

కళ్ళు చెదరగొడుతూ కళా హృదయులను ఆకట్టుకుంటున్న ఆ పెయింటింగ్ రవీంద్రభారతిలో జరుగుతున్న చిత్రకళా ప్రదర్శన ఉత్సవానికే అలంకార భూషణమయమైంది.

'వాలెంటైన్స్ డే, ఫిబ్రవరి-14' సందర్భంగా ఏర్పాటైన రకరకాల వర్ణ చిత్రాల ప్రదర్శన కాన్సెప్ట్...

**'ప్రణయం.'**

పై వర్ణ చిత్రానికి చిత్రకారుడు అమర్చిన చక్కని టైటిల్-

**చెలి!**

ఆ 'చెలి' చిత్రపటాన్ని అందంగా రూపుదిద్దిన ఆర్టిస్ట్ మధూకర్ కుంచె నిపుణత సహృదయుల మనసు పొరల్ని శృతి చేస్తోంది.

ఆహ్లాదకరమైన వర్ణ చిత్రాల లాలిత్యాన్ని రెప్పార్పకుండా చూస్తూ... సరదాగా విసుర్లు విసురుకుంటూ... ఆ ఆర్ట్ గ్యాలరీని ఆసాంతం చుట్టేస్తోన్న నలుగురు కాలేజీ బ్యూటీస్ బృందం... 'చెలి' చిత్రం చెంతకు వచ్చేసరికి.. మాయావి మంత్రదండం కదిపి తమపై

మంత్రజలం చిలికించినట్టు శిలా సదృశులై నిలబడి పోయారలాగే.

'సమీహ' అయితే విస్మయ విరాజితమైంది.

అచ్చం తన పోలికల్తో ఉన్న ఆ చిత్రాన్ని తదేకంగా పరికించింది. కనురెప్పలు వాల్చకుండానే.

ఆ ఆర్ట్ సమీహ రూపురేఖల్ని పుణికి పుచ్చుకున్నట్టు ఉండడం వాస్తవం.

అందుకే ఆ అమ్మాయి కనురెప్పలు టపటపలాడిస్తూ సంభ్రమాశ్చర్య సంలీను రాలయ్యింది. ఆర్టిస్ట్ క్రియేటివిటీకి హేట్సాఫ్ అనుకుంది.

అదే విషయం ఫ్రెండ్స్‌తో అంది.

"ఎక్కడో ఒక చోట ఎవరికో ఒకరికి పోలికలు కలవడం సహజమేగా దానికంత ఉత్సాహం దేనికంటూ" కొట్టిపారేశారు ఫ్రెండ్స్.

మరో చిత్రపటాన్ని చూడ్డానికి కాస్త ముందుకి జరిగారు వాళ్లు.

అక్కడే నిలబడి ఇంకా ఆ చిత్రపట రసాస్వాదనలో మునిగి వున్న సమీహకి వెనకాల వచ్చి చేరాడొక యువకుడు.

"మీ హృదయాన్ని దోచుకున్న ఆ పెయింటింగ్ సృష్టికర్త... మధూకర్‌ని... నేనే!" అంటూ ఆమె చెవిలో గుసగుస లాడినట్టుగా తనని తాను పరిచయం చేసుకున్నాడా యువకుడు సగర్వంగా.

సమీర స్వరాలాపనకి పూలచెండు పులకరించి నాట్యమాడినట్టు వయ్యారాలు పోతూ అలవోకగా తలతిప్పిందామె. ఇపుడిద్దరూ ఎదురెదురయ్యారు.

వైట్ కలర్ పైన రెడ్ బ్లూ గ్రీన్ లైన్స్ ఉన్న టీ షర్ట్‌ని బ్లూ జీన్స్‌తో టక్ చేసి బ్లాక్ షూ ధరించిన ఆ యువకుడు మ్యాన్లీగా హుందాగా అందంగా ఆకర్షణీయంగా అగుపడ్డాడామెకి. స్టయిల్‌గా నవ్వుతున్నాడు కూడా.

'ఆర్టే కాదు. ఆర్టిస్ట్ కూడా హాండ్‌సమ్‌గా వున్నాడే!' అనుకుంది.

ఆమె ముఖబింబాన్ని చూస్తూనే ఒక్క క్షణం సర్వం మరచి దిగ్భ్రమకి లోనయ్యాడు మధూకర్. తను గీచిన అమ్మాయి పోలికలను పోలి ఉందీ ముద్దుగుమ్మ.

"ఇదెలా సాధ్యం? నేనెప్పుడూ మీకు తారసపడలేదే?" విరజాజులు పోటీపడి కిలకిల సవ్వడి చేసినట్టు మృదువైన పదాలు ఆమె పెదాల కొమ్మ నుండి విచ్చుకున్నాయి.

"అదే కదా చిత్రం. విచిత్రం. నేను కూడా మీలాగే. సేమ్‌టుయూ!" అన్నాడు నూనూగుమీసాల కుంచెమాటు నుండి చిరునవ్వు చిందిస్తూ.

"పోనీ... నన్నెప్పుడైనా ఎక్కడైనా చూశారా? కనీసం నా ఫోటో అయినా కానీ" అడుగుతోంటే ఆమె అందమైన కనుపాపలు... కనురెప్పల నడుమ అరమోడ్పులయ్యాయి.

"నో! నెవర్ సా. కానీ... నే రంగులద్దిన విశ్వ సౌందర్యం... నా కళ్లెదుట ప్రాణం పోసుకొని నిలబడడం... ఇట్స్ మై లక్" మెరుస్తున్న కళ్లతో నమ్మకంగా చెప్పాడు.

ఆ లవ్లీ కామెంట్‌కి ఆమె చెక్కిళ్లు అదిరాయి.

"షెల్ ఐ నో యువర్‌స్వీట్‌నేమ్!" ఆమె మౌనం వీడాలని తన పలకరింపు

కొనసాగించాడు.

కొమ్మనుండి రాలిపడిన పారిజాత పుష్పం వీణాతంత్రియల తనువుని మీటి సమ్మోహన రాగం పలికించినట్టు...

"సమీహ" అంటూ ఆమె అధరాలు మధువులొలికాయి.

"కొత్తగా లవ్లీగా బావుంది" మనస్ఫూర్తిగా అభినందించాడు.

పాలభాగాన్ని ముద్దాడుతున్న ముంగురుల్ని నునులేత మునివేళ్లతో సుతారంగా వెనక్కి తోస్తూ "యు ఆర్ ది ఫస్ట్ ప్రైజ్ విన్నర్! నా సిక్త్‌సెన్స్ నాతో గుసగుసలాడుతోంది... ష్యూర్" హస్కీగా అంది సమీహ.

ఒక అందాల సుందరి... తన మనో విశ్వసుందరి... ప్రతిభకి అభినందన మందారమాల వేస్తోంటే... మధూకర్ అంతరంగం ఊయలై ఊగిసలాడింది.

"థా...థాంక్స్..." అతగాడి పెదాలు ఆ కితాబుకి మతాబుల్లా వెలిగాయి.

"కీపిటప్!" అంటూ హంస గమనంతో అల్లనల్లన పిల్ల తెమ్మెరలా సాగిపోయి తన ఫ్రెండ్స్‌తో కలిసిపోయింది.

ఆ జవ్వని పలుకులాజ్ఞానుసారం నిజంగానే పదిలపరుచుకున్నాడతను. ఆ ముగ్ధ మనోహర రూప లావణ్యాన్ని... ఎద లోగిలిలో... మది లాహిరిలో...

✤ ✤ ✤

సెలయేటి అలల గలగల సవ్వడులకి చెంగు చెంగున దూకుతూ తీరం చెంత వాలిన లేడిపిల్లలా మధూకర్ గదికి ఉత్సాహంగా పరుగెత్తుకు వచ్చింది సమీహ.

ఆమె రాకకి అమృత భాండం అక్కున చేరినట్టు అబ్బురపడ్డాడతను.

పంజాగుట్ట దుర్గానగర్ కాలనీలో వేంకటేశ్వర దేవాలయం పక్కింట్లో అద్దెకుంటున్నాడు. సాదరంగా ఆహ్వానించాడామెని. వచ్చి అతడికి ఎదురుగా కూర్చుంది.

"ఈ సిల్వర్ గ్రీన్ చుడీదార్‌లో అప్సరసలా ఉన్నారు" తన చూపుల్ని కట్టి పడేసిన ఆమె వంక ఆరాధనగా చూస్తుండి పోయాడలాగే.

మొగ్గలా ముడుచుకు పోయింది.

"మాటల్లో కూడా రంగులద్దడమేనా మహాశయా!" కాస్త చనువుగా అభియోగం మోపింది.

"మీరందంగా వుంటారు" అంటూ స్పందించాడు.

"మీరు అద్భుతంగా గీస్తారు" బదులిచ్చింది.

మౌనం దాల్చాడు.

తలతిప్పి గదిని పరిశీలనగా చూస్తూ "ఏ అలికిడీ లేదు. ఒక్కరే వున్నట్టున్నారు" అడిగింది.

"అవును. ఒంటరినే. అమ్మానాన్నా మా ఊర్లోనే వుంటారు. నాన్న యు.డి.సి., అమ్మ హౌస్ వైఫ్. చదువు నిమిత్తం జగిత్యాల నుండి వచ్చానిక్కడికి" చెప్పాడు టూకీగా తన స్వవిషయాల్ని.

"మీ ఎడ్యుకేషన్"

"మొన్నే బ్యాచులరాఫ్ ఫైన్ ఆర్ట్స్ (B.F.A.) పూర్తి చేశాను. సర్చింగ్ ఫర్ జాబ్. యానిమేషన్‌లో ట్రై చేస్తున్నా. ఇంటర్వ్యూస్ అటెండవుతున్నా"

"వేరీ నైస్".

"మీ గురించి"

"చెప్పను. ఐమీన్ డిటైల్స్ చెప్పను. సమయం వచ్చినప్పుడు మీకే తెలుస్తుంది. సి.బి.ఐ.టి. లో ఫస్టియర్ ఇంజనీరింగ్ చేస్తున్నా! ప్రస్తుతానికి ఈ ఒక్క డేటా చాలు"

"నా రూమెలా తెలిసింది?"

"కావాలనుకున్నపుడు... కలవాలనుకున్నపుడు... సప్తలోకాలైనా గాలిస్తాను"

"ఈ అనుగ్రహ వచనాల ఆంతర్యమేమిటో?"

"బాల్యం నుండి ఆర్ట్ అంటే ఎంతో ఇష్టం. ఆర్టిస్టులన్నా అభిమానమే. చిత్రకారిణి నవ్వాలని మహా కోరిగ్గా ఉండేది. చిత్రకళ పట్ల ఎంత అభిరుచి వుంటేనేం? నా కోరిక నెరవేరలేకపోయింది. కనీసం మీలాంటి వాళ్ల సాహచర్యంతోనైనా ముత్యమై మెరుస్తానేమోనని స్వాతి చినుకునై వచ్చానిక్కడికి" స్వరపేటిక సుస్వరవీణై సరాగాలు ఆలపిస్తున్నట్టున్నాయి ఆమె పలుకుల మధురిమ.

"చిత్రకళ పట్ల... చిత్రకారుల పట్ల... మీరు ప్రదర్శిస్తున్న అభిమానం వెలకట్టలేనిది" అన్నాడతను అదే అభిమానంతో.

తన కళ్లకి నక్షత్రాల మెరుపునద్దుకుంటూ "కంగ్రాట్యులేషన్స్" అందామె.

"తెలిసిందా?" చెదిరిపోని చిరుదరహాసం అతడి పెదవుల మధ్యన ఒదిగింది.

"పేపర్స్‌లో అంతలేసి పెద్దక్షరాలతో మీ గురించి న్యూస్ వేస్తే తెలియకుండా వుంటుందా? ఎనీ హౌ ప్రైజ్ కొట్టేశారు"

"మరి ఫస్టొస్తానని ఆశీర్వదించారుగా!"

"అది గుర్తు చేయడానికేగా వచ్చింది"

"మంచి మనసు వెల్లడించిన మంచి మాటలెపుడూ శిలాక్షరాలవుతాయి"

"నాదేముంది?"

"దిస్ క్రెడిట్ గోస్ టుయు!"

"అది అంతా మీ కళాత్మక నైపుణ్యం." భుజాలెగరేసింది నాట్యమయూరి భంగిమలా. ముచ్చటేసిందతనికి.

"తళుక్కుమనే మీ ముఖవర్చస్సు చిత్రోత్సవస్సయ్యింది... నా విజయకారకమైంది."

"అలాగైతే నా రూపాన్ని ప్రతిబింబించేలా మరిన్ని చిత్రాలు గీసుకోండి"

"ఊహూ!" తల అడ్డంగా ఆడిస్తూ" నా మనసు పొరల్ని కుంచెలా మలచుకొని మీ స్నిగ్ధ ముగ్ధత్వాన్ని నా మనోఫలకంపైనే చిత్రించుకుంటాను తప్ప... ఇక ఏ కాన్వాసుపై మీ ఛాయాచిత్రాల్ని రేఖీయం చేయను" అన్నాడు.

అది విని సమీహ కనుపాపలు కాంతి సమూహ సమ్మేళితమయ్యాయి.

ఏమనుకుందో ఏమో-

"బై! వెళ్లొస్తానిక." తేనెలద్దిన పలుకుల్ని మధూకర్ గుండె గదినిండా నింపేసి సుతారంగా కదిలిందక్కడి నుండి.

సమీహ వెళ్లినవైపే రెప్పార్పకుండా చూస్తూ గాఢంగా నిట్టూర్చాడు మధూకర్.

✣ ✣ ✣

సమీహ తన కనురెప్పల రేకుల్ని మరింత వికసింపచేస్తూ మోగిన సెల్‌లోని నెంబర్‌ని తీరుబడిగా వీక్షించింది. పరిచయం లేని కొత్త నెంబరది.

"హలో!" మార్దవమైన ఆమె గొంతు మరులు గొలిపే శబ్ద తరంగాలుగా మారి అవతలివైపు అలవోకగా ప్రవహించాయి.

"హలో సమీహ! నేను... మధూకర్‌ని!"

"వావ్! నా మొబైల్ డిజిట్స్ మీకెలా పరిచయమయ్యాయి?" వొకింత దిగ్భ్రమ చెందుతూ అడిగింది.

"చేరాలనుకున్నపుడు... చేరువకి రావాలనుకున్నపుడు... దేన్నైనా అందుకుంటాను. అవలీలగా అందుబాటులోకి తెచ్చుకుంటాను"

"మరి ఈ ఫోన్ రాయబారమేంటో?"

"మీ స్వర వరసిద్ధి పొందాలని! నేనిపుడు జగిత్యాలలో వున్నాను. మీ నుండి దూ...రం...గా"

"ఎనీథింగ్ స్పెషల్...!"

"ఒక హ్యాపీ న్యూస్..."

"వావ్! చెప్పండి... చెప్పండి..."

"నేషనల్ వైడ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌కి నా 'చెలి' సెలక్టయ్యింది"

"మార్వలెస్"

"ఎవ్రీ స్టేట్ నుండి ఒక్కొక్క ఆర్టిస్ట్‌కే ఈ మహదావకాశం దక్కింది. మన రాష్ట్రం నుండి నా ఒక్కడికే గౌరవం లభించింది. నా తరపున ఢిల్లీలో మూడు పేయింటింగ్స్ ఎగ్జిబిట్ చేయాలి"

"ఏమేం తీసుకెళ్తున్నారు?"

"నాకేం తోచడం లేదు. ఆ బాధ్యత మీపై మోపుతున్నాను. మీరు సెలక్ట్ చేసి సెలవిస్తే వాటితో ఎంట్రీ అవుతా"

"నే చూడాలిగా"

"అయితే రావాలిగా"

"ఎప్పుడు రాను?"

"దేవతలు ఏవేళైనా భక్తులకి అనుగ్రహదర్శనభాగ్యం కలిగించొచ్చు. నేను మా

ఊరినుండి బయల్దేరి వస్తున్నా. మధ్యాహ్నానికల్లా అక్కడ వుంటాను"

"అలాగైతే ఈవినింగ్ కలుస్తాను"

"ఈ నిముషం నుండే వెయిట్ చేస్తా"

✣ ✣ ✣

సాయంత్రం అవుతుండగా మధూకర్ గదికి చేరుకుంది సమీహ.

ఒక్కొక్కటిగా తను స్వయంగా గీచిన చిత్రాలన్నింటిని ఆమె ముందు పరిచాడు. అతడి చిత్రాల అభిరుచికి వర్ణాల వైవిధ్యానికి అచ్చెరువొందింది.

సమీహ టైంపాస్‌కి కాకుండా అనుభూతి పొందుతూ చిత్రాల్ని ఆసక్తిగా పరిశీలిస్తుండడాన్ని గమనించాడు మధూకర్.

ఆమె చిత్రాల ధ్యాసలో వుండగా జరిగిందది. కంఠం కింద ఎద భాగం నుండి చున్నీ వైదొలిగిపోయి వుంది. ఆమె పై వస్త్రానికున్న హుక్కొకటి విడివడి వుంది. పరధ్యానంలో ఆమె చూసుకోలేదు.

అనాచ్ఛాదిత ఆ ప్రాంతం వైపు పడిందతని దృష్టి.

మధు కను'పాప'లు మరింత 'పెద్ద'వి అయ్యాయి. అసంకల్పితంగా గుటకలు మింగసాగాడు.

"ఈ మధ్య పేపర్లో చదివినట్టు గుర్తు. ఆర్టిస్ట్ హుస్సేన్‌గారి ఓ చిత్రానికి విదేశంలో కొన్ని కోట్లు పలికిందట. ఆ లెక్కన మీ ప్రతి ఆర్ట్ కూడా ఎన్నో రెట్ల కోట్ల విలువ చేస్తుంది" భావోద్వేగంతో చెప్పింది సమీహ.

చూపులు మరల్చకుండా పొడిగా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడంతే.

తిరిగి ఏదో అనబోతూ తల మధువైపు తిప్పిన సమీహ అతడి చూపుల్లోని అలజడిని గమనించింది. తేడా అర్థమై చప్పున తనని తాను సర్దుక్కూర్చుంది. అతడి వాలకం ఎందుకో రుచించలేదామెకు.

మిగిలిన చిత్రాల్ని పరిశీలించడం అన్యమనస్కంగానే పూర్తయిందనిపించింది. 'చెలి'తో పాటు మరో ఆర్ట్‌ని సెలక్ట్ చేసి పక్కన పెట్టింది.

ఆమె డల్‌గా మారడం పసిగట్టిన మధూకర్ అభ్యర్థనగా...

"ఢిల్లీ ఆర్ట్ గ్యాలరీకి నా చిత్రాలు సెలక్టయిన శుభసందర్భంగా మీకీ రోజు మంచి హోటల్‌లో డిన్నర్ ఆఫర్ చేస్తున్నాను. కాదనకూడదు"

పెన్సిల్ గీతను ఎరైజర్‌తో తుడిచేసినట్టు ఇందాకటి దృశ్యాన్ని మస్తిష్కం నుండి రిమూవ్ చేసుకుంటూ "మీరు సెలక్టయినందుకు.. మీరే పార్టీ అరేంజ్ చేయడంలో గొప్పేముంది? నేనే మీకిస్తాను. వెరయిటీగా వుంటుంది. అలాగైతేనే ఈ డిన్నర్ ప్రపోజల్‌కి ఒప్పుకుంటా." అంది హుషారుగా.

మరో మాటలేకుండా "ఓకే!" అనేసాడతను.

✣ ✣ ✣

సమయం సాయంత్రం ఏడవుతోంది. చీకటి అలుముకుందెపుడో. తన బైక్ మీదే

రావాలని సమీహ పట్టు పట్టడంతో... మౌనంగా ఆమె సన్నీ వెనకాల కూర్చున్నాడు.

వాస్తవానికి ఆ రోజు మధూకర్‌ని తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించాలనుకుంది. కానీ గదిలోని సంఘటనకి చివరి నిమిషంలో మనసు మార్చుకొని ప్రోగ్రామ్‌ని సడెన్‌గా హోటల్‌కి మార్చింది.

బంజారాహిల్స్‌లోని ప్రేమ్‌నగర్ వీధిలో తాజ్ హోటల్‌కి తీస్కెళ్లింది. ఆ పరిసర ప్రాంతంలోనే తమ ఇల్లు ఉందనే విషయాన్ని చెప్పకుండా దాచిపెట్టింది.

సరిగ్గా వారం గడిచాక తిరిగి సమీహని తన గదికి ఆహ్వానించాడు మధు.

ఢిల్లీ కొరకు ఆమె రెండే రెండు చిత్రాల్ని ఎన్నిక చేయడంతో థర్డ్ ఆర్ట్ కోసం శ్రమించి రెండు చిత్రాల్ని కొత్తగా గీచాడు.

"రెండింటిలో మీరేది సెలెక్ట్ చేస్తే దాన్ని ఫైనల్ చేస్తాను" అంటూ మొదట ఆమె చేతికి ఒక చిత్రపటం అందించాడు.

ఆ ఆర్ట్‌ని చూసి స్టన్నయి పోయింది.

రెప్పవేయడం మరచి "వావ్! ఎంతద్భుతంగా వుందో?" అంది.

ఒకే దేహానికి మూడు తలల్ని కలిపి రసరసమ్యంగా చిత్రం గీశాడు.

ఆ వీణ, త్రిశూలం, పాత్రనిండుగా కాసులు... చిహ్నాలుగా... సరస్వతి, పార్వతి, లక్ష్మీదేవిల ప్రతి రూపాల్తో... ఒక సరికొత్త భావావిష్కరణ గావించాడు. ముష్పురు దేవతామూర్తులను ఏక చిత్రమాలికగా మలచి ఓ నవ్యమైన ఊహకి అంకురార్పణ చేశాడు.

"రియల్లీ యు ఆర్ గ్రేట్! ఒకనాటి రవివర్మను మించి ఫ్యూచర్‌లో పేరొస్తుంది మీకు... తథ్యమిది" అంది మనస్ఫూర్తిగా.

అతడి వదనం సప్తవర్ణ శోభితమైంది.

దానిని పక్కనపెట్టి "సెకండ్‌ది ఇవ్వండి" అంది.

సంకోచిస్తూనే రెండవ చిత్రాన్ని సమీహ ముందుంచాడు. ఒక్కసారిగా ఉలిక్కి పడింది.

పల్లెటూరి వాతావరణంలో... సెలయేటి ఒడ్డున... ఇద్దరు యువతుల అర్ధనగ్న స్నానఘట్ట దృశ్యమది. ఆ బొమ్మలో కళాత్మక హృదయం లోపించి శృంగార భావమే ప్రస్ఫుటంగా బహిర్గతమవుతోంది.

తన పరిచయ పరంపరలో మధూకర్‌లో చెలరేగుతున్న వైరుధ్య భావ ప్రకంపనలకిది సజీవ సాక్ష్యం కాదుకదా ? తొలిసారిగా అతడిలాంటి చిత్రాన్ని గీయడం ఎందుకో నచ్చలేదామెకు. పెదవ్విరిచి వెంటనే టీపాయ్‌పై గిరాటేసింది బోర్లాపడేట్టుగా.

సమీహ మనోభావాల్ని రిసీవ్ చేసుకొనే మూడ్‌లో లేడతను. ఆమె విచిత్ర దేవతా స్వరూపాల పటాన్ని ఎన్నిక చేసిందని అర్థమవుతూనే ఉంది.

తన ధోరణిలో తానన్నాడు...

"రేపే నా ఢిల్లీ ప్రయాణం. పదిరోజుల అనంతరం తిరిగి మనం కలుసుకోవడం జరుగుతుంది. ఈసారి కూడా నేను బహుమతి కైవసం చేసుకోవాలని ఆకాంక్షిస్తూ అడ్వాన్స్‌గా

మీరో గిఫ్టివ్వాలి. ఓసారీ... వెరయిటీ మీకిష్టం కదా! పోనీ నేనే మీకిస్తానొక సర్‌ప్రైజ్ గిఫ్ట్..." అంటూ వచ్చి ఆమె పక్కన చేరాడు.

సమీహ కనుబొమ్మలు ముడివడ్డాయి. కనురెప్పలు ప్రశ్నార్థకమయ్యాయి.

"నా రేపటి ఢిల్లీ ప్రయాణానికి తొలి గుర్తుగా... ఒక మధుర జ్ఞాపకంలా..." అంటూనే-

మైకం కమ్మిందో... తొందరపడ్డాడో... తెలీదు.

విచక్షణ కోల్పోయి... సమీహ అనుమతి కోరకుండానే... ఆమె ఇష్టాయిష్టాలతో పని లేకుండానే... హఠాత్తుగా ముందుకు వంగి-

సమీహ పెదవుల కాన్వాసుపై తన పెదాలకుంచెతో ముద్దుని దృశ్యీకరించాడు.

ఊహించని ఆ చర్యకి ప్రతిచర్యగా... తప్పుకోబోయి... మొహం తిప్పుకోబోయి... తప్పించుకోలేకపోయింది. ఇబ్బందిగా కదిలింది.

అందుకతను ఫీలవ్వలేదు. సమీహ ఫీలింగ్స్‌ని అసలే పట్టించుకోలేదు.

సభ్యత మరచి... సంస్కారం విడిచి.. అతడలా చొరవ తీసుకొని ప్రవర్తించడం జీర్ణించుకోలేకపోయింది.

గభాల్న లేచి, తను సెన్స్ కోల్పోకుండా పొలైట్‌గా "ఆల్ ది బెస్ట్" అని మాత్రం అనగలిగి తక్షణం అక్కడి నుండి నిష్క్రమించింది.

ఢిల్లీకి చేరుకున్నాక సారీ చెప్పాలని సమీహకి కాల్ చేశాడు. మధూకర్‌కి నో రెస్పాన్స్! అతను అక్కడ ఉన్నన్ని రోజులు అదే పనిగా ట్రై చేశాడు. ఫోన్‌కి దొరకలేదామె. సిమ్ తీసేసిందని తెలియదతనికి.

కన్సోలేషన్ ప్రైజ్ గెల్చుకున్నాడు. ఆ శుభవార్తని మోసుకొని ఢిల్లీ నుండి తిరిగొచ్చాక ఏకంగా ఆమె కాలేజ్‌కి వెళ్లాడు తొలిసారిగా.

అడ్మిషన్ ట్రాన్స్‌ఫర్ చేసుకుందని తెలిసింది.

ఆకాశం భళ్లున చీలి... ఓ మేఘ శకలం ఫెళ్లున విరిగి... మెరుపు తునకై మేనిని తాకి... హై ఓల్ట్‌ల షాక్‌కి గురిచేసినట్టయ్యింది.

ఎందుకలా చేసింది? అతడి గుండె మెలితిరిగింది.

ఆ రోజు రవీంద్రభారతిలో కనబడిన ఆమె ఫ్రెండ్స్‌ని గుర్తుతెచ్చుకొని వాళ్లని కలిశాడు. వాళ్లు పెదవి విప్పలేదు. మొహం చాటేశారు.

అదిగో అప్పుడు...

కలవరపడ్డాడు. కలతచెందాడు.

నెల గడిచాక మధూకర్‌కి ఓ ఉత్తరం వచ్చింది. ఫ్రమ్ అడ్రస్ లేదు. పోస్టల్ ముద్ర అతుక్కుపోయి వుంది.

ఆ ఉత్తరం హృదయ గవాక్షాన్ని ఆత్రంగా తెరచి ఆ సాంతం చదివాడు. సువర్ణ వర్ణిత ఆవర్ణితమైన ఆ సుమాక్షర సమూహ స్పర్శకి తడిసి తడిసి ముద్దయిపోయాడు.

"మధూకర్ గారికి,

అన్నీ అనుకూలిస్తే 'మధూ' అని ముద్దుగా పిలవాలనుకున్నాను. నా హృదయాన్ని మీ హృదయానికి సమర్పించాలని ఆశపడ్డాను. నా స్వప్నం భగ్నమైంది.

'సమీహ' అంటే అర్థం కోరిక. కానీ నా 'కోరిక' ధ్వంసమైంది.

ఆరోజు రవీంద్రభారతిలో మీతో పరిచయమైన అనంతరం నా ఫ్రెండ్స్‌తో పందెం కాశాను. 'మిమ్మల్ని గెలుస్తానని... మీతో ప్రేమను పంచుకుంటానని...' కానీ ఓడిపోయాను.

మనిషి జీవితంలో -

**బాల్యం, యవ్వనం, వార్ధక్యం దశలున్నట్టే...**

**ఆకర్షణ, ప్రేమ, వ్యామోహం... అనే పొరలుంటాయి.**

ఆకర్షణ అటు ప్రేమకు... అదే ఆకర్షణ ఇటు వ్యామోహానికి... దారి తీస్తుంది.

ప్రేమ నిశ్చలమైనది. నిర్మలమైనది.

వ్యామోహం వాంఛాపూరితమైనది. విషభరితమైనది.

మీ కనుపాపలు ప్రేమను వర్షిస్తాయేమోనని ఎదురుచూశాను. కానీ అవి వ్యామోహాగ్నితో శిథిలమై పోయాయి.

బెదిరిపోయాను.

కళాకారుడిగా స్వచ్ఛంగా వుండాల్సిన మీ మనసు 'సమీహ' హృదయం కొరకు కాకుండా, సంకుచితమైన 'కోరిక' వైపు పరుగులు తీసింది.

మీ వాలకం, మీ వ్యామోహం నా అంతరంగాన్ని కలవరపెట్టాయి.

చలించిపోయాను, చెదిరిపోయాను.

**ఆకాశానికి వ్యామోహమెక్కువ. తనని నమ్మిన వాటిని నట్టేట వదిలి అంతరిక్షాన్నే స్పృశించాలనుకొంటుంది. కానీ మలినం లేని భూగోళం అన్నింటినీ తన అక్కున చేర్చుకోవాలని ఆరాటపడుతుంది.**

రెంటి మధ్యన ఎంత వైరుధ్యం?

అందుకే నింగీనేలా ఒకటి కావెన్నటికి.

మీలా నాలా!

ప్రణయం లేని చోటు పడతికి చేటు.

అందుకే వెనుదిరిగి వెళ్లిపోతున్నాను. మీనుండి దూరంగా... మీ మనసుకి అందనంత సుదూరంగా...

ఈ సమయంలోనే మా నాన్నగారికి కూడా ట్రాన్స్‌ఫర్ అవడం నాకనుకూలించింది.

**పరిమళం లేని పూవు... స్వచ్ఛతలేని హృదయం... పనికిరావు తోటకి... మనసు పూదోటకి...**

నా కోసం వెతకొద్దు. దొరకను.

పొరపాటున మీకు తారసపడినా నా కనురెప్పలు కదపను. నా కనుపాపలు కలపను.

మీ జీవితాధ్యాయంలో... ఏ భావముద్రలూ పడని... తెల్లని పుటగానే నన్నిలా మిగిలిపోనివ్వండి.

- ఓ సమీహ"

చదవడమయ్యాక మధూకర్ చేతులు వణికాయి. గుండె కంపించింది. మనసు ముక్కలయ్యింది.

ఒక మార్పుకి సరికొత్త సంకేతంగా...

ప్రక్షాళనమైన ఓ అశ్రుకణం... ప్రేమామృతం అద్దుకొని... కనుకొనల నుండి జారి అప్రయత్నంగా అతడి చెక్కిలిని ఆర్తిగా తడిమింది.

నిశ్చలమవుతూ... నిబ్బరమవుతూ... ఓ స్థిర నిర్ణయానికి వచ్చాడతను.

✣ ✣ ✣

మధు కోరుకున్నట్టుగానే యానిమేషన్ స్టూడియోలో జాబ్ వచ్చింది. నెలకి నలభైవేల జీతం.

అతడి మరో 'కోరిక' అతడి 'సమీహ' అతడికి దక్కాల్సి వుంది.

ఉద్యోగంలో జాయినయ్యాక అప్పుడు గాలింపు మొదలుపెట్టాడు సమీహ కోసం... ఆమె ఉనికి కోసం...

సమీహ గనక తారసపడితే... దోసిట పట్టిన తన హృదయంతో... మనసా వాచా ఆమె ప్రణయం ముంగిట మోకరిల్లాలని తపన పడుతున్నాడు.

చూద్దాం!

ఆమె కలుస్తుందో లేదో... అతడి ప్రేమ ఫలిస్తుందో లేదో... కాలమే చెప్పాలి.

పెళ్ళిళ్లు స్వర్గంలో నిర్ణయించబడతాయంటారు.

నిశ్చయంగా స్వచ్ఛమైన ప్రేమలు మాత్రం మనసు పొరల్లో లిఖించబడతాయి.

(జూన్, 2008)

**ప్రేమ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ**

✳